క్లుప్తంగా

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం


యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేసి, ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం,శేషవస్త్రాలను అందించారు.

యోగాతో ఆరోగ్యం


యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

పెందుర్తి: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సంతరించుకుంటుందని మండల విద్యాశాఖాధికారి-2 టి.మధుమూర్తి అన్నారు. ఈ నెల 21న జరగనున్న జాతీయ యోగా దినోత్సవం .. యోగా ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పెందుర్తి గ్రామీణ ప్రాంత గ్రామ సచివాలయాల స్థాయిలో యోగా పోటీలను సోమవారం నిర్వహించారు. మొత్తం 21 మంది విద్యార్థులు పాల్గొనగా ఆరుగురు తదుపరి పోటీలకు ఎంపికయ్యారు. విజేతలను మధుమూర్తి ప్రత్యేకంగా అభినందించారు. పీడీలు జేడీ చక్రవర్తి, ఎం.దుర్గామాధవి, సీఆర్పీలు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు 9 వినతులు


వినతిని పరిశీలిస్తున్న జెడ్సీ హేమావతి

పెందుర్తి: వేపగుంట జీవీఎంసీ జోన్-8 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమానికి వివిధ సమస్యలపై తొమ్మిది వినతులు అందాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జరిగిన కార్యక్రమంలో ప్రజల నుంచి జోనల్ కమిషనర్ కె.హేమావతి వినతులు స్వీకరించారు. ఆయా ఫిర్యాదులను పరిశీలించి, విచారణ చేసి తగు చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులకు జెడ్సీ ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో జోన్-8 అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీమా పరిహారం అందజేత


బీమా పరిహారం అందిస్తున్న గండి బాబ్జీ

పెందుర్తి: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రాంపురంవాసి ఇందుగుబిల్లి రాజుబాబు కుటుంబానికి టీడీపీ ప్రమాద బీమా పరిహారాన్ని అందించారు. రాంపురం సమీపంలోని టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఏపీ ఆయిల్‌ఫెడ్ చైర్మన్, టీడీపీ ఇంచార్జి గండి బాబ్జీ చేతుల మీదుగా మృతుని భార్య ఆశాజ్యోతికి చెక్ అందించారు. జెడ్సీ మాజీ ఫ్లోర్ లీడర్ రెడ్డి నారాయణరావు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యంపై ఫిర్యాదు

పెందుర్తి: మండలంలోని చింతలగ్రహారానికి చెందిన ఓ వివాహిత అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. సీఐ కె.వి.సతీష్‌కుమార్ తెలిపిన వివరాలు.. పెంటకోట నరేష్, శ్యామల(22) దంపతులు గ్రామంలో నివాసం ఉంటున్నారు. స్థానికంగా రాడ్ బెండింగ్ పనులు చేసే నరేష్ గత నెల 25న పనికి వెళ్లిపోయాడు. ఇంటికి వచ్చేసరికి భార్య కనిపించలేదు. బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించాడు. ఇంట్లోని రూ.30 వేలు నగదు, అరతులం బంగారం కనిపించట్లేదని గుర్తించారు. గతంలో కూడా ఆమె విజయనగరం జిల్లా గుర్లవిందాడకు చెందిన ఓ వ్యక్తితో వెళ్లి కొద్ది రోజులకు తిరిగి వచ్చినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు.

ఉమాచంద్రమౌళీశ్వరుడికి విశేష పూజలు

సింహాచలం: అడవివరంలోని విజినిగిరిపాలెంలో ఉన్న ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామికి విశేషంగా అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తులతో ఆలయం కిటకిటలాడింది. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు ఈ కార్యక్రమాలను నిర్వహించారు.

ప్లాస్టిక్ నిషేధం.. ఉత్తర్వులకే పరిమితం!


సబ్బవరంలోని అమలా నికేతన్ సమీపంలో రోడ్డు పక్కన తగులబెడుతున్న ప్లాస్టిక్ వ్యర్థాలు



గొటివాడ కాలనీలో రోడ్డును ఆనుకుని వేసిన ప్లాస్టిక్ వ్యర్థాలు

- మార్కెట్లు, ప్రధాన కూడళ్లలో పేరుకుపోతున్న ప్లాస్టిక్ వ్యర్థాలు
- పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోని ప్లాస్టిక్ నిషేధ చర్యలు
- సబ్బవరం మండలంలో అధికారుల తనిఖీలు అంతంత మాత్రమే

ప్లాస్టిక్.. మానవాళి నిత్య జీవితంలో చాలా పనుల్ని తేలిక చేసింది. దీంతో దీని వినియోగం విపరీతంగా పెరిగి, ప్రమాదకర స్థాయికి చేరింది. పర్యావరణ పరంగా అంతే తీవ్రమైన దుష్ప్రభావాలను కలిగిఉండటంతో ప్లాస్టిక్ వినియోగంపై ప్రపంచ వ్యాప్తంగా ఆందోళన నెలకొంది. ఇప్పటికే చాలా దేశాలు నిర్దేశిత మందం లోపు ప్లాస్టిక్ వినియోగంపై నిషేధం విధించాయి. దేశ వ్యాప్తంగా తీసుకున్న కార్యాచరణలో భాగంగా విశాఖ జిల్లాలో కూడా ఈ ఏడాది జనవరి 1 నుంచి నిషేధం అమల్లోకి వచ్చింది. అయితే అధికారుల పర్యవేక్షణ లోపం, ప్లాస్టిక్ తయారీదారుల అడ్డగోలు వైఖరితో నిషేధం ఉత్తిమాటగానే మారుతోంది. సబ్బవరం మండలంలో ఇప్పటికీ యథేచ్ఛగా జరుగుతోన్న ప్లాస్టిక్ వినియోగమే దీనికి నిదర్శనం.


న్యాయ విశ్వవిద్యాలయం సమీపంలో రోడ్డును ఆనుకుని వేస్తున్న ప్లాస్టిక్ వ్యర్థాలు

సబ్బవరం: ప్లాస్టిక్‌లేని జీవితాన్ని ఊహించే సాహసం చేయలేం. నిత్య జీవితంలో మనం వినియోగించే చాలా వస్తువులు ప్లాస్టిక్‌తో తయారు చేసినవే. అయితే సింగిల్ యూజ్ ప్లాస్టిక్(ఎస్‌యూపీ) వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలతో వీటి నిషేధానికి ప్రభుత్వాలు సంకల్పించాయి. 120 మైక్రాన్ల లోపు మందం కలిగిన, ఎస్‌యూపీ వినియోగాన్ని పూర్తి స్థాయిలో నిషేధించాలని జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్ గతేడాది చివర్లో జారీ చేస్తూ, జనవరి 1 నుంచి పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. అయితే సబ్బవరం మండలంలో ప్లాస్టిక్ నిషేధ చర్యలు కనీస స్థాయిలో కూడా ఉన్న దాఖలాలు కనిపించట్లేదు. ఎక్కడ చూసినా.. ప్లాస్టిక్ వినియోగం విచ్చలవిడిగా ఉంది. ఇందుకు రోడ్లపై చేరుతున్న ప్లాస్టిక్ వ్యర్థాలను చూస్తే ఎవరికైనా ఇల్లే తెలిసిపోతుంది.


సబ్బవరంలో డ్రైన్‌లో ప్లాస్టిక్ వ్యర్థాలతో కూడిన పూడిక

పేరుకుపోతున్న ప్లాస్టిక్



ప్లాస్టిక్ వ్యర్థాల సమస్య ఇటీవల చాలా ఎక్కువయింది. సబ్బవరం మేజర్ పంచాయతీలో ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నా.. ఫలితం ఆశించినంతగా లేదు. ప్లాస్టిక్ వినియోగం విపరీతంగా పెరగడంతో ఎక్కడబడితే అక్కడ ప్లాస్టిక్ వ్యర్థాలను పడేస్తున్నారు. రోడ్లు, కాల్వలు, ఖాళీ ప్రదేశాల్లో ఎక్కడికక్కడ ఇవి పేరుకుపోయి, ఇబ్బందిగా మారుతున్నాయి.

–సింగంపల్లి వెంకటరావు, జోడుగుళ్ల జంక్షన్, సబ్బవరం

అవగాహన పెంచుతున్నాం



ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు పలు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. ప్లాస్టిక్ వ్యర్థాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఘన వ్యర్థ నిర్వహణ కేంద్రాలకు తరలించి ప్రాసెసింగ్ చేస్తున్నాం. నిబంధనల మేరకు నిర్దేశిత మందం కలిగిన ప్లాస్టిక్ బాటిళ్లు, కవర్లను మాత్రమే వినియోగించాలి. నిషేధిత ప్లాస్టిక్ నియంత్రణకు దుకాణాలు, తయారీ యూనిట్లలో తరచూ తనిఖీలు నిర్వహిస్తున్నాం.

–బి.పద్మజ, ఎంపీడీవో, సబ్బవరం మండలం

నిషేధ ఉత్తర్వుల అమల్లో నిర్లిప్తత

ఈ ఏడాది జనవరి 1 నుంచి ప్లాస్టిక్ నిషేధం పూర్తి స్థాయిలో అమల్లోకి వచ్చింది. అప్పటి వరకు ఉత్పత్తి అయిన ఎస్‌యూపీని వినియోగించి, కొత్తగా వాటిని తయారు చేయరాదని ఆంక్షలు విధించారు. దానికి ఓ నెల ముందుగానే జీవీఎంసీ/విశాఖ జిల్లా పరిధిలో ప్లాస్టిక్ నిషేధంపై జిల్లా కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్‌లు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఇంత చేసినా ఇప్పటికీ ప్లాస్టిక్ వినియోగం యథేచ్ఛగా కొనసాగుతూనే ఉంది. ముఖ్యంగా చేపలు, చికెన్, మటన్ దుకాణాలు, కూరగాయలు, కిరాణా షాపులు, టీ, టిఫిన్ దుకాణాల్లో ఇంకా వీటినే వినియోగిస్తున్నారు. 120 మైక్రాన్లు దాటిన ప్లాస్టిక్‌ను మాత్రమే వినియోగించాలని ఆదేశాలున్నా.. అవి కాస్త ఖర్చుతో కూడుకోవడం, పైగా కిలోకు తక్కువ సంఖ్యలో కవర్లు రావడంతో వాటి కొనుగోలుకు ఆసక్తి చూపట్లేదు.

యథేచ్ఛగా వినియోగం

సబ్బవరం మండలంలో సుమారు 24 గ్రామ పంచాయితీలు ఉన్నాయి. దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం, మారిటైం విశ్వవిద్యాలయం, పెట్రో విశ్వవిద్యాలయం వంటి పలు విశ్వవిద్యాలయాలు ఉన్నాయి. జాతీయ రహదారికి ఆనుకుని నిత్యం రద్దీగా ఉంటూ, వాణిజ్యంగా ఎంతో అభివృద్ధి చెందుతున్న సబ్బవరంలో నిషేధిత ప్లాస్టిక్ వినియోగం యథేచ్ఛగా కొనసాగుతోంది. మండల కేంద్రం సబ్బవరంతో పాటు అన్ని గ్రామాల్లో ఎక్కడపడితే అక్కడ ప్లాస్టిక్ వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. ఈ ప్లాస్టిక్ వ్యర్థాలు డ్రైనేజీల్లోకి చేరి, డ్రైనేజీలు పూడుకుపోతున్నాయి. మురుగు ప్రవాహాన్ని అడ్డుకోవడంతో వర్షాకాలంలో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దోమలు వ్యాప్తి చెంది, రోగాలు ప్రబలుతున్నాయి.

అంకితభావంతో పనిచేసే వారికి తగిన గుర్తింపు

'వెన్నుపోటు దినం' పోస్టర్ ఆవిష్కరణలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త అదీప్‌రాజ్


వెన్నుపోటు దినం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్, పార్టీ నేతలు

పరవాడ: నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పిలుపునిచ్చారు. మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు అధ్యక్షతన స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మండల పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలు, నాయకులకు పార్టీలో తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. పార్టీని బూత్‌లెవల్ నుంచి సంస్థాగతంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నామన్నారు. మండల స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు పార్టీ కమిటీలను నియామకం యుద్ధప్రాతిపదికన జరుగుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ విభాగాలన్నీ పార్టీకి వెన్నెముకలా ఉండేలా గ్రామ స్థాయి నుంచి అనుబంధ విభాగాల కమిటీలను త్వరగా పూర్తి చేయాలన్నారు.

కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజల ముందుకు తీసుకెవెళ్లి, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటంలో పార్టీ కమిటీలు కీలక పాత్ర పోషించాలన్నారు. ఎన్నికల్లో అమలుకాని హామీలిచ్చి ప్రజలను మోసగించి అధికారంలోకి వచ్చాక, హామీలను అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం ప్రజలను వెన్నుపోటు పొడిచిందని దుయ్యబట్టారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను మోసగించిన తీరును ఎండగడుతూ జూన్ 4న తలపెట్టిన వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఆ రోజు ఉదయం 8 గంటలకు రాంపురం నుంచి పెందుర్తి ఎమ్మార్వో కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలని కోరుతూ మెమొరాండం అందిస్తామన్నారు. అనంతరం వెన్నుపోటు దినం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యులు పైల శ్రీనివాసరావు, పార్టీ సీనియర్ నాయకులు కొటాన రాము, చుక్క రామునాయుడు, వైస్ ఎంపీపీలు బి.నాగేశ్వరరావు, బి.అప్పలరాజు, మండల యూత్ అధ్యక్షుడు బండారు శ్రావణ్‌కుమార్, పార్టీ సర్పంచులు వెన్నల అప్పారావు, గొర్లి గోపి అమ్మలు, కూండ్రపు వరలక్ష్మి సీతారామయ్య, పల్లా నాగమణి అప్పారావు, పెదిశెట్టి పూజాశేఖర్, పార్టీ నాయకులు బొద్దపు చిన్నారావు, బురద రాజు, పల్లా గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రికి బయటి రక్తాన్ని అనుమతించాలి


డీఎంహెచ్‌వో జగదీశ్వరరావుకు వినతిపత్రం అందిస్తున్న దాడి శ్రీనివాస్

పెందుర్తి: అగనంపూడిలోని హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి.. రోగులకు మెరుగైన సేవలందించినా, వారికి అవసరమైన రక్తాన్ని బయటి నుంచి అనుమతించకపోవడంతో చాలా మంది ఇబ్బంది పడుతున్నారని సాయి హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధి దాడి శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. సదరు ఆస్పత్రికి సొంత రక్తనిధి ఉండడంతో, బయటి రక్తాన్ని అనుమతించట్లేదని, తక్షణమే రోగుల ప్రాణాలను దృష్టిలో ఉంచుకుని బయటి బ్లడ్ బ్యాంకుల్లో దాతలు అందించే రక్తాన్ని అనుమతించేలా చూడాలని జిల్లా ఉన్నతాధికారులను కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ హరేందిరప్రసాద్, డీఎంహెచ్‌వో జగదీశ్వరరావులకు వినతిపత్రం అందించారు. హోమిబాబా క్యాన్సర్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం వస్తున్న ఇతర రాష్ట్రాల రోగులు రక్తం సమస్యను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. రోగికి కావాల్సిన రక్తం ఆస్పత్రిలో అందుబాటులో లేనపుడు వారి పరిస్థితి ఘోరంగా ఉంటోందన్నారు. ఆ సమయంలో బయటి రక్తాన్ని అనుమతించి, చికిత్స చేస్తే రోగులకు మేలు జరుగుతుందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఆస్పత్రి నిర్వాహకులతో మాట్లాడి సమస్య పరిష్కరించాలని కోరారు.

చిన్నప్పటి నుంచే పర్యావరణ స్పృహ అవసరం


తాడిలో పర్యావరణ దినోత్సవంలో పాల్గొన్న అధికారులతో విద్యార్థులు

పరవాడ: పిల్లలకు చిన్నప్పటి నుంచి పర్యావరణంపైఅవగాహన కల్పించడం ద్వారా భవిష్యత్‌లో వారి భాగస్వామ్యంతో పర్యావరణ పరిరక్షణ సాధ్యపడుతుందని విశాఖ ఫార్మాసిటీ డీజీఎం గిరిధర్‌భక్షి అన్నారు. రాంకీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తానాం, తాడి గ్రామాల్లో సోమవారం పర్యావరణ దినోత్సవ కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం రాంకీ ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ శ్రీకాంత్ మాట్లాడుతూ ఏటా జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జేఎన్‌పీసీ పరిసర గ్రామాల్లో చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విజేతలకు ఈ నెల 5న బహుమతులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో భాగంగా 5 నుంచి 10వ తరగతి విద్యార్థులకు పర్యావరణంపై చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. తానాం నుంచి 48 మంది, తాడి నుంచి 40 మంది విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఫార్మాసిటీ సేఫ్టీ అధికారి శ్రీనాథ్, ఫౌండేషన్ సిబ్బంది రాజేశ్వరి, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

రేషన్ డిపో ఏర్పాటు చేయాలని వినతి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న కాలనీవాసులు

పరవాడ: మండలంలోని గొర్లివానిపాలెం దరి టిడ్కో, జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ ప్రజల సౌకర్యార్థం స్థానికంగా రేషన్ డిపో ఏర్పాటు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం డిమాండ్ చేశారు. ఈ మేరకు ఐద్వా ఆధ్వర్యంలో కాలనీ వాసులతో కలిసి తహసీల్దార్ ఎస్వీ అంబేడ్కర్, ఎంపీడీవో కార్యాలయ ఏవో రాంబాబుకు సోమవారం వినతిపత్రాలు అందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ టిడ్కో, జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీల్లో నివసిస్తున్న ప్రజలు రేషన్ సరకుల కోసం రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న గొర్లివానిపాలెం రేషన్ డిపోకు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీ వాసుల ఇబ్బందులను గుర్తించి స్థానికంగా రేషన్ డిపో ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఐద్వా ఏరియా కమిటీ అధ్యక్షులు బంగారమ్మ, కార్యదర్శి అన్నపూర్ణ, సభ్యులు సంతోషి, కనకమహాలక్ష్మి, రమణమ్మ, వరలక్ష్మి, మంగ, గోపాల్‌రావు, లక్ష్మి పాల్గొన్నారు.

పోటీలతో విద్యార్థుల్లో సృజనాత్మకత

సబ్బవరం: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులకు పేపర్ రీడింగ్, పేపర్ క్రాఫ్టింగ్ పోటీలను సోమవారం నిర్వహించారు. విద్యార్థులు రకరకాల పేపర్లతో మంచి ఆకృతులను రూపొందించారు. ఇటువంటి పోటీల ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతుందని గ్రంథాలయ అధికారి వి.శిరీష తెలిపారు. పోటీల్లో విజేతలకు శిక్షణ శిబిరం ముగింపు రోజున అతిథుల చేతులమీదుగా బహుమతులు అందజేస్తామన్నారు. శిబిరంలో రోజుకో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఘనంగా విజయ గణపతి ఆలయ వార్షికోత్సవం


ఆలయ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే పంచకర్ల

పెందుర్తి: చినముషిడివాడలోని ఆర్‌వీఎస్ సిల్వర్ స్ప్రింగ్స్ గేటెడ్ కమ్యూనిటీలో కొలువైన విజయ గణపతి స్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి గణపతికి ప్రత్యేక పూజలు జరిపారు. మధ్యాహ్నం ప్రసాద వితరణ చేపట్టారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, 89వ వార్డు కార్పొరేటర్ దాడి వెంకటరమేష్, నాయకులు శానాపతి శంకర్రావు, శానాపతి సోమశేఖర్, ఎస్‌వీఎస్ ప్రతినిధులు రవిరాజు, శ్రీనివాస్, రవీంద్ర, రాజు, ఆనంద్, గోపాలనాయుడు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే ఉన్నత శిఖరాలు

సింహాచలం: చదువుతోనే ఉన్నత శిఖరాలకు చేరుకోగలమని కార్మికశాఖ విశ్రాంత ఉప కమిషనర్ ఎస్.సూర్యనారాయణ తెలిపారు. అడవివరం గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞానశిబిరంలో సోమవారం బాలల హక్కుల పరిరక్షణ, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన అంశంపై పలు సూచనలు చేశారు. బడి ఈడు పిల్లలంతా తప్పనిసరిగా బడికి వెళ్లి చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న విశ్రాంత హెచ్ఎం కె.గౌరీశంకరరావు, కేఎస్ఆర్ మూర్తిలు విద్య ఆవశ్యకత, భాషాప్రావీణ్యం, క్రమశిక్షణ, సాధన ప్రయోగాలు, స్వజనాత్మకత తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో కార్మికనాయకుడు సీహెచ్ఎస్ఎన్ రాజు, గ్రంథాలయాధికారి నరసింహం పాల్గొన్నారు

బొమ్మలు చేద్దాం రండి

పెందుర్తి: వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో సోమవారం కథలు చదవడం, రాయడం, చెప్పడంపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఉపాధ్యాయుడు ఎం.ఎస్.మహేష్ పేపర్‌తో బొమ్మలు తయారు చేయడం నేర్పించారు. అనంతరం సామూహిక పుస్తక పఠనం చేయించారు. బీటెక్ విద్యార్థి పి.యశ్వంత్ స్పోకెన్ ఇంగ్లిష్ నేర్పించారు. పలు ఆటలు ఆడించారు. యోగా గురువు లక్ష్మీప్రసన్న ధ్యానంపై మెళకువలు నేర్పారు. విశ్రాంత ఉపాధ్యాయుడు జానకిరామ్ వేమన, సుమతి, భాస్కర శతక పద్యాలు నేర్పించారు. గ్రంథాలయాధికారి బి.సూర్యకళ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, పలువురు పాఠకులు పాల్గొన్నారు.

వాటర్ పార్కు నిర్మాణంలో చెరువు దురాక్రమణ

- పంచాయతీ తీర్మానం లేకుండానే చెరువు స్థలంలో కల్వర్టు నిర్మాణం
- లోపల కూడా ప్రభుత్వ స్థలం ఆక్రమణ
- తుపాన్లు, వరదలు వస్తే సరిపల్లి ముంపునకు గురవుతుంది
- హైకోర్టు అడ్వకేట్ కమిషన్ సభ్యుని ఎదుట సరిపల్లివాసుల ఆవేదన


సరిపల్లిలో రికార్డులను పరిశీలిస్తున్న హైకోర్టు అడ్వకేట్ కమిషన్ సభ్యుడు ఉదయ్‌కుమార్

పెందుర్తి: 'మా గ్రామంలోని వర్షపునీరు బయటకు పోయే మార్గంలో చెరువు భూగర్భాన్ని ఆక్రమించి వాటర్ పార్కు నిర్మాణం చేపడుతున్నారు. వర్షాలు, వరదలు వస్తే మా గ్రామం పూర్తిగా ముంపునకు గురవుతుంది. వాటర్‌పార్కు దురాక్రమణపై తక్షణమే చర్యలు తీసుకోవాలి' అని మండలంలోని సరిపల్లి వాసులు మొరపెట్టుకున్నారు. సరిపల్లి సమీపంలో ఎరీనా వాటర్‌పార్కు నిర్మాణం తీవ్ర వివాదాస్పదమైంది. వాటర్‌పార్కు యజమానులు సరిపల్లి సర్వే నెం.263లోని చెరువు స్థలాన్ని ఆక్రమించి, కనీసం పంచాయతీ అనుమతి కూడా లేకుండా కల్వర్టు నిర్మాణం చేపట్టారని.. న్యాయం చేయాలంటూ హైకోర్టును ఆశ్రయించారు. దీంతో ఈ వివాదంపై పూర్తిస్థాయి విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని హైకోర్టు ఏక సభ్య కమిషన్‌ను నియమించింది. ఈ నేపథ్యంలో కమిషనర్, హైకోర్టు అడ్వకేట్ ఒ.ఉదయ్‌కుమార్ సోమవారం గ్రామంలో పర్యటించారు. వివాదాస్పదమైన చెరువు ప్రాంతాన్ని పరిశీలించారు. రికార్డులు ఆరా తీశారు. పెందుర్తి మండల సర్వేయర్ శ్రీరామ్మూర్తి ఆధ్వర్యంలో పూర్తిస్థాయి సర్వే నిర్వహించారు. కల్వర్టు, రోడ్డు నిర్మాణం కోసం చెరువు ఆక్రమించడం వాస్తవమే అని ప్రాథమికంగా నిర్ధారించారు. వాటర్‌పార్కులో కూడా సర్వే నిర్వహించి కొంత భాగం ఆక్రమణ జరిగినట్లు అంచనా వేశారు. ఈ సందర్భంగా అడ్వకేట్ కమిషనర్ ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ హైకోర్టు ఆదేశాల మేరకు తాను పూర్తిస్థాయి విచారణ చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ వివాదంపై పూర్తిస్థాయి నివేదికను హైకోర్టుకు సమర్పించనున్నట్లు వెల్లడించారు.

ఊరిని కాపాడండి: సర్పంచ్ గొర్లె రామకృష్ణ

తమ గ్రామం వద్ద వాటర్ పార్కు నిర్మాణంలో పూర్తిగా అవకతవకలు ఉన్నాయని సర్పంచ్ గొర్లె రామకృష్ణ ఆరోపించారు. భారీ వర్షం, వరదల సమయంలో వచ్చే నీరు ఈ మార్గంలోనే బయటకు వెళ్తుందని, ఇప్పుడు అడ్డుగా పార్కు నిర్మించడంతో భవిష్యత్‌లో ఏదైనా ఉపద్రవం సంభవిస్తే పరిణామాలు ఊహించలేమని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు చెరువుకు జలాధారంగా ఉన్న చిన్నపాటి కాలువలను మూసేయడంతో చెరువు ఎండిపోయి భవిష్యత్‌లో దాదాపు 120 ఎకరాలు సాగు చేస్తున్న 90 మంది రైతులు తీవ్రంగా నష్టపోతారన్నారు. ఎంపీటీసీ సభ్యుడు గొల్లవిల్లి రమణ మాట్లాడుతూ సరిపల్లి ప్రజల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని వాటర్‌పార్కు దురాక్రమణపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకుడు జేసీబీ ప్రసాద్ మాట్లాడుతూ వాటర్‌పార్కు అంటే పూర్తిగా పాశ్చాత్య సంస్కృతి ఉంటుందని, పార్కుకు అతి సమీపంలోనే ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల భవిష్యత్‌పై ప్రభావం చూపే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కల్వర్టు నిర్మాణానికి ఎలాంటి అనుమతి గానీ, తీర్మానం గానీ ఇవ్వలేదని పంచాయతీ కార్యదర్శి మల్లికార్జునరావు కమిషనర్‌కు లేఖను అందించారు.